సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



విక్రాంత్.. విక్రమాదిత్య.. విశాఖ
ఐఎన్ఎస్ విక్రాంత్, విక్రమాదిత్య ఎంత విలువైనవో.. తూర్పు తీరానికి విశాఖ అంతే విలువైందని పలువురు ప్రశంసించారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో



రాజ్‌మాకు గిరాకీ
గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించిన రాజ్‌మా మంచి ధర పలికింది. కిలో రూ.80 నుంచి రూ.90మధ్య ధర లభించింది. 8లో

న్యూస్‌రీల్

నేడు సీఎం విశాఖ రాక



మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ రానున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి.. మధ్యాహ్నం 4.25 గంటలకు బీచ్‌రోడ్డులోని నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద హెలిప్యాడ్‌లో దిగుతారు. 4.25 నుంచి 4.30గంటల వరకు ప్రజా ప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. 4.30 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు బయలుదేరుతారు. అక్కడ జరిగే డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లాఅధ్యక్షుడు కోలా గురువులు కుమారుడి వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. నూతన వధూవరులను ఆశీర్వదించి.. తిరిగి కోస్టల్ బ్యాటరీ వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 5 గంటలకు అక్కడ నుంచి విశాఖ విమానాశ్రయానికి బయలు దేరుతారు. 5.20 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్తారు.

కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు

అరకులోయ టౌన్: ఎండపల్లివలస కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీకి డీఈవో బ్రహ్మాజీ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయన మంగళవారం ఆ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో వ్యర్థాలు పేరుకుపోయి ఉండడం, మరుగుదొడ్ల నుంచి నీరు బయటకు రావడాన్ని గమనించిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్యం క్షీణించడంతో పాఠశాల స్పెషల్ ఆఫీసర్, సిబ్బందిని మందలించారు.

ఘనంగా ప్రారంభమైన సమ్మక్క, సారలమ్మ జాతర



జంపన్న వాగులో ప్రత్యేక పూజలు చేసి జలాలను తీసుకువస్తున్న గ్రామస్తులు

ఎటపాక: రాష్ట్ర సరిహద్దుల్లోని మినీ మేడారం మారాయిగూడెంలో సమ్మక్క, సారలమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఆదివాసీల ఆరాధ్యదైవాలైన సమ్మక్క, సారలమ్మ జాతరను వచ్చేనెల 2వ తేదీ వరకు వైభవంగా జరపనున్నారు. ముందుగా ఆలయ పూజారులు, గ్రామ పెద్దలు జంపన్న చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ పొలిమేరలో మండ మేలుగుట్టతో జాతర ప్రారంభించారు. ఉదయం సామ్మక్క, సారక్క గద్దెల వద్ద దేవర బాలలు మడకం అచ్చెమ్మ, సోడి శాంతమ్మలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్నారు.ఛత్తీస్‌గఢ్,తెలంగాణా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఐదు రోజుల పాటు జరగనున్న ఈ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జాతరలో రెండవ రోజు బుధవారం సారక్కను గద్దెపైకి తేవడంతోపాటు సరిహద్దు మన రాష్ట్రంలోని జగ్గారం గ్రామం నుంచి వనదేవతను తరలించుకు రావడం వంటి కార్యక్రమాలు జరుపనున్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

- ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థిని పరామర్శిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

మహారాణిపేట(విశాఖ): అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ కోరారు. మంగళవారం కేజీహెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్‌ను ఆయన సందర్శించారు. రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న గిరిజనులు, విద్యార్థులను పరామర్శించి, వైద్య సేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికిత్స పొందుతున్న గిరిజనులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైద్యపరీక్షల నిర్వహణకు, నాణ్యమైన మందులు సరఫరా చేయడానికి ఐటీడీఏ నుంచి కేజీహెచ్‌కు పూర్తిసహకారం అందిస్తున్నామన్నారు. ట్రైబల్ సెల్‌కు ఒక అంబులెన్స్ ఉందని, మరోఅంబులెన్స్ కేటాయించామని చెప్పారు. పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి వైద్యాధికారిని కేజీహెచ్‌కు డిప్యుటేషన్‌పై పంపించామని,ట్రైబల్‌సెల్‌వైద్యులు సంపత్ నిరంతరం అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్నారని చెప్పారు. పిల్లలకు అవసరమైన శస్త్ర చికిత్స చేయడానికి తిరుపతిలోని పద్మావతి ఆ స్పత్రి అధికారులతో చర్చించినట్టు తెలిపారు. అల్లూరి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జమాల్ బాషా, కేజీహెచ్‌సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్,ఏటీడబ్ల్యువో క్రాంతికుమార్‌పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో వెలుగు రేఖలు

అత్తెసరు ఆదాయంతో కొట్టుమిట్టాడుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయూత అందిస్తూ ఆదుకుంటోంది. చేయూత పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సాయం అందజేస్తూ వారు స్వయం ఉపాధి పొందేలా చర్యలు చేపట్టింది. ఈ పథకం జిల్లాలో సత్ఫలితాలిస్తోంది. పలువురు మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు(ఫైల్)



పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ తలారిసింగ్ గ్రామానికి చెందిన ఈ గిరిజన మహిళ పేరు పాతుని పద్మ. 2019కి మునుపు వీరి ఇంట్లో భర్త, ఆమె కూలి పనులకు వెళ్లేవారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనికి వెళ్లినా పూట గడవడానికి ఇబ్బందులు పడేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ చేయూత పథకం ప్రవేశపెట్టడం ఈమెకు కలిసొచ్చింది. వైఎస్సార్ చేయూత పథకానికి అర్హురాలైంది. ఈ పథకం ద్వారా ఈ మూడేళ్లు ఆమెకు ప్రభుత్వం నుంచి మొత్తం రూ.56,250 ఆర్థికసాయం లభించింది. తలార్‌సింగి వద్ద సొంతంగా కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. ఇప్పుడు ఈమె కుటుంబం కూలి పనులకు వెళ్లే బాధ తప్పింది. కిరాణ దుకాణం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తోంది. ఈమె కుమార్తెను కూడా జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకం ద్వారా నర్సింగ్ విద్య చదివించారు. ఆమె కూడా ప్రస్తుతం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో నర్స్‌గా పనిచేస్తోంది. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకం ద్వారా సొంతంగా కిరాణ దుకాణం నిర్వహిస్తూ తాము మూడు పూటలా అన్నం తింటున్నానని ఆమె చెబుతోంది.



జీకే వీధి మండలం సీలేరు గ్రామానికి చెందిన ఈ మహిళ పేరు సీహెచ్.చినతల్లి. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. గతంలో కుల వృత్తిపై ఆధారపడేది. కానీ అదాయం అంతంత మాత్రమే. వేరే ఏ ఇతర వ్యాపారం చేద్దామన్న పెట్టుబడికి ఇబ్బందులు ఎదురయ్యాయి. పైగా వయస్సు కూడా పై బడుతుండడంతో కుల వృత్తి చేసేందుకు ఇబ్బందులు పడింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ చేయూత పథకానికి అర్హురాలైంది. తొలి ఏడాది రూ.18,750 నగదు నేరుగా ఆమె బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఇలా వరసగా మూడేళ్ల పాటు మొత్తం రూ.56,250 ఆమెకు అందింది. ఆ సొమ్మును ఆమె వృథాగా పోనివ్వలేదు. సీలేరు గ్రామంలో పాలు, పెరుగు దుకాణం ప్రారంభించింది. వ్యాపార కూడా సాఫీగా సాగుతోంది. ఇప్పుడు పాలు, పెరుగుతో పాటు ఐస్‌క్రీమ్స్, తిను బండరాలు విక్రయిస్తోంది. అన్ని ఖర్చులు పోను నెలకు సుమారు రూ.20వేలకు పైగా ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయంతో సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు వెసులుబాటు కలిగిందని ఆమె ఆనందంగా చెబుతోంది.

- మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత
- మూడేళ్లుగా వరుసగా ఆర్థిక తోడ్పాటు
- జిల్లాల్లోని 22 మండలాల్లో 1,30,622 మందికి లబ్ధి
- రూ. 244.81 కోట్లు మంజూరు
- సొంత వ్యాపారాలు చేసుకుంటున్న మహిళలు
- త్వరలో నాలుగో విడత నిధులు విడుదల



స్వయం సహాయక సంఘాల మహిళలు

పాడేరు : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో జిల్లాలో వేలాదిమంది జీవితాల్లో వెలుగులు నిండాయి. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అమలు చేస్తున్న చేయూత పథకంతో పలువురు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు దఫాలుగా ప్రభుత్వం ఇచ్చిన చేయూతను మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించే స్థాయికి చేరుకున్నారు. వడ్డీ పైసా కూడా అప్పు చేయకుండా ప్రభుత్వం ఇచ్చే సొమ్మును పెట్టుబడిగా పెట్టి వ్యాపారాలు చేసుకుంటూ నిలదొక్కుకుంటున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఎన్నడూ మా కోసం ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదని మహిళలంతా ముక్తకంఠంతో చెబుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 45ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఈ పథకం వర్తింపజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో మూడు దఫాలుగా 1,30,622 మంది మహిళలకు రూ.244.81కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలో నాల్గవ విడత వైఎస్సార్ చేయూత నిధులు విడుదల కానున్నాయి.

జిల్లాలో మూడు విడతలుగా విడుదలైన నిధులు నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం : అరకువేలి	లబ్ధిదారులు	నిధులు (రూ. కోట్లల్లో)
మొదటి విడత	11,487	23.44
రెండో విడత	12,848	24.15
మూడో విడత	16,157	30.3
మొత్తం	40,492	77.89

నియోజకవర్గం : పాడేరు	లబ్ధిదారులు	నిధులు (రూ. కోట్లల్లో)
మొదటి విడత	12,039	22.54
రెండో విడత	12,324	23.04
మూడో విడత	18,819	29.39
మొత్తం	43,182	74.97

నియోజకవర్గం : రంపచోడవరం	లబ్ధిదారులు	నిధులు (రూ. కోట్లల్లో)
మొదటి విడత	15,149	28.35
రెండో విడత	15,119	28.31
మూడో విడత	18,819	35.29
మొత్తం	49,087	91.95

జీడిపిక్కల యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

రంపచోడవరం: ఔత్సాహికులైన గిరిజన యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. దీనిలో భాగంగా జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. పీవో తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన యువత జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్ కార్డ్, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ ఫొటోలను దరఖాస్తుతో పాటు ఏడు మండలాలకు సంబంధించిన వెలుగు ఏపీఎంలకు అందజేయాలని లేదా ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో కానీ వేయాలని తెలిపారు. ఒక్కో యూనిట్ విలువ రూ.10 లక్షల పైబడి ఉంటుందని, ఇందులో ఆటోమెటిక్ అదేవిధంగా మాన్యువల్ మిషన్లు ఉంటాయని ఆయన తెలిపారు. యూనిట్ మొత్తం విలువలో 50 శాతం ఐటీడీఏ నుంచి మంజూరు చేయనున్నట్టు చెప్పారు. మిగిలిన 50 శాతం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.పూర్తి వివరాలకు 9391690144 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పీవో తెలిపారు.

81 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలో 81మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించారు. ఐటీడీఏ సమావేశపు హాలులో మంగళవారం అర్హులైన తెలుగు, హిందీ పండిట్, పీఈటీలకు గిరిజన సంక్షేమశాఖ డీడీ అబ్బలోము పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఎస్టీయూ ఎస్టీ సెల్ కన్వీనర్ లండా వేణుగోపాల్, బి.కృష్ణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ



హాజరైన అధికారులు

జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ ఆదేశాలు

సాక్షి,పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాడేరు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు నియోజకవర్గంలోని తహసీల్దార్లు,సెక్టార్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలపై కచ్చితమైన సమాచారం అందించాలన్నారు. మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయం అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మరుగుదొడ్లు అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాల్లో రూ.20వేల వ్యయంతో వెంటనే వాటిని నిర్మించాలని ఆదేశించారు. ముందుగా రూ.10 వేలు అడ్వాన్స్ చెల్లిస్తామని, మిగిలిన రూ.10 వేలు పనులు పూర్తయితే చెల్లిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల పైకప్పులు లేకపోతే మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఉండాలని ఆమె సూచించారు. పోలింగ్ సిబ్బంది ప్రయాణానికి అవసరమైన బస్సులు,జీపులకు ప్రతిపాదనలు ఇచ్చారని, ఆయా రూట్లలో బస్సులు,జీపులు ప్రయాణించేదీ లేనిదీ తగిన వివరాలు తమకు అందజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల కార్యాలయాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్‌డీసీ పి.అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి అప్పలరాము

సీలేరు: మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా వచ్చేనెల 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నట్టు జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి కె.అప్పలరాము తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో పోలీసుల నిఘా నడుమ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. స్థానిక జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఉండగా, కొత్తగా మరో మూడు కొత్త సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలను కలుపుకొని 15,210 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించబోమని స్పష్టం చేశారు. 60 శాతం కంటే తక్కువ హాజరు ఉన్న విద్యార్థుల నుంచి గతంలో అపరాధరుసం వసూలు చేసి, పరీక్షలకు అనుమతించేవారని, ఈ ఏడాది ఆ ఫీజు వసూలు చేయకుండానే పరీక్షలకు అనుమతిస్తున్నట్టు చెప్పారు. పాడేరు,అరకు,రంపచోడవరం,చింతూరు డివిజన్లకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 2 , ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లు కేటాయించినట్టు చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు చోటుచేసుకున్నా సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్లను జారీ చేశామని, పోలీస్ స్టేషన్లలో ప్రశ్న పత్రాలను భద్రపరిచామని తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఐటీడీఏ పీవో కావూరి చైతన్య
- జాబ్‌మేళాలో 144 మందికి ఉద్యోగాలు



ఉద్యోగానికి ఎంపికైన యువతికి నియామక పత్రం అందచేస్తున్న పీవో చైతన్య



జాబ్‌మేళాలో భాగంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో పీవో చైతన్య, ఇతర అధికారులు

చింతూరు: యువత తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో ఐటీడీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాను పీవో ప్రారంభించారు. ఈమేళాకు 454 మంది దరఖాస్తు చేసుకోగా 311 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 144 మంది ఎంపికయ్యారు. ఎంపికై న వారికి పీవో కావూరి చైతన్య ఉద్యోగ నియామక పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో భాగంగా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన ఎంతోమంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం తన వద్దకు వస్తున్నారని తెలిపారు. వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పాటు పోలీసులు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమం స్ఫూర్తితో జాబ్‌మేళా నిర్వహించాలని భావించినట్టు చెప్పారు. దీంతో స్కిల్ డెవలప్‌మెంట్, ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో జాబ్‌మేళాను విజయవంతంగా నిర్వహించామని పీవో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రస్తుతం వేతనాలు తక్కువైనా.. నైపుణ్యంతో రాణించడం ద్వారా ఉద్యోగ అనుభవంతో భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందవచ్చన్నారు. గతంలో తానుకూడా జాబ్‌మేళాలకు హాజరై ఆ అనుభవం ద్వారా నేడు ఉన్నత పదవికి చేరుకున్నానని తెలిపారు. ఎన్నికల అనంతరం చింతూరులో మెగా జాబ్‌మేళా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు పీవో తెలిపారు.

చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ నిరుద్యోగ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తమకు లభించిన అవకాశంతో ఉద్యోగాలు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ దగ్గర ప్రాంతాల్లోనే ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో వివిధ కంపెనీలతో మాట్లాడి జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. వృత్తిలో రాణించడం ద్వారా అవే సంస్థల్లో మంచి స్థానాలు పొందే అవకాశముంటుందన్నారు. జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏపీవో సుజాత, ఏవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న ఐటీడీఏ సిబ్బంది

రంపచోడవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి శిబిరాల్లో సేకరించే రక్తం అత్యవసర వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో డి.ఎన్.వి. రమణ, టీడబ్ల్యూ ఏవో రమణ, డాక్టర్ ముఖర్జీ, లీగల్ సెల్ డీటీ స్వామి, జి.ఆనంద్, నాగభూషణ,ఏరియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తోటపల్లి ఎస్‌బీఐలో చోరీకి యత్నం

- తాళాలు, సీసీ కెమెరాలు ధ్వంసం
- లాకర్‌లు తెరిచేందుకు విఫలయత్నం
- క్లూస్ టీంతో పోలీసుల దర్యాప్తు



బ్యాంక్ లాకర్ గది వద్ద పగుల గొట్టిన తాళాలు



ఈ లాకర్లు తెరిచేందుకే దొంగలు విఫలయత్నం చేశారు

ఎటపాక: మండల పరిధిలోని తోటపల్లి ఎస్‌బీఐలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.30 గంటల సమయంలో సుమారు ఎనిమిది మంది కత్తులు, గొడ్డళ్లు, గునపాలతో బ్యాంక్ వద్దకు చేరుకుని తలుపుల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్, మేనేజర్ గదిలోని పత్రాలు, సామాన్లను చిందరవందరగా చేశారు. లాకర్ గది తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి లాకర్లు తెరిచేందుకు ప్రయత్నించగా సైరన్ మోగడంతో అక్కడ నుంచి పరారయ్యారు. దొంగలు తాళాలు పగులగొడుతున్న సమయంలో చుట్టు పక్కల ఇళ్లలోని వారు నిద్రలేచి గమనించినప్పటికీ దొంగల వద్ద ఉన్న మారణాయుధాలను చూసి భయపడి బయటకు వచ్చేందుకు ఎవరూ సాహసించలేదు. పోలీసులకు సమాచారం తెలిసేలోగానే దొంగలు అక్కడ నుంచి పరారయ్యారు. బ్యాంక్‌లో దొంగలు పడ్డారనే సమాచారం చుట్టుపక్కల గ్రామాలకు తెలియడంతో కలకలం రేగింది. గతంలో కూడా ఇదే బ్యాంక్‌లో దొంగలు చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలను గుర్తించడం కష్టతరంగా మారింది. ఎటపాక సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి బ్యాంకు వద్దకు చేరుకుని, పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సూర్యనారాయణరాజు



సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సూర్యనారాయణరాజు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా దాట్ల వెంకట సూర్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ స్థానంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఉన్నారు. కాగా రాజుకు 2009లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనకు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అలంకరణ చేపల పెంపకంపై శిక్షణ

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 29 నుంచి 4వ తేదీ వరకు అలంకరణ చేపల పెంపకం, అక్వేరియంల తయారీపై గిరిజన యువతకు శిక్షణ ఇస్తున్నట్టు కేవీకే శాస్త్రవేత్త వీరాంజనేయులు తెలిపారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ సహకారంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను 9553364265 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన వసతి అందిస్తున్నట్టు తెలిపారు.

రాజ్‌మాకు గిరాకీ

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించిన రాజ్‌మా ముగింపు ధర బాగుంది. మండలంలో కొంతమంది రైతులు ధరలు పలికినప్పుడు విక్రయించటానికి దాచి ఉంచిన రాజ్‌మా చిక్కుళ్లు వారపు సంతల్లో ధరలు పలుకుతుండడంతో సంతబయలు గ్రామంలో మంగళవారం జరిగి వారపు సంతకు తరలించి విక్రయాలు జరిపారు. రాజ్‌మా చిక్కుళ్లు కిలో రూ.80 నుంచి రూ.90మధ్య ధర పలికింది. గత సంవత్సరం ముగింపు ధర రూ.50వరకు పలికిందని రైతులు చెబుతున్నారు. రైతులు రాజ్‌మా చిక్కుళ్లు విక్రయించకుండా దాచి పెట్టుకొని ధర పలికినప్పుడు అమ్ముకుంటే మంచి ధర లభిస్తుందని పలువురు అభిప్రాయ పడ్డారు. వారపు సంతలో రాజ్‌మా చిక్కుళ్లకు డిమాండ్ మంచి ధర రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సత్తా చాటారు.. కొలువు పట్టారు

- జాబ్‌మేళాకు విశేష స్పందన
- 144 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు
- నిరుద్యోగుల హర్షాతిరేకాలు



ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగ యువత



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధి

చింతూరు: ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా అందిస్తున్న సహకారంతో ఏజెన్సీలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. చింతూరులో ఐటీడీఏ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాకు హాజరై వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఈ జాబ్‌మేళాకు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, భద్రాచలం, హైదరాబాద్‌కు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. వారు నిరుద్యోగ యువతకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి తమ కంపెనీల్లో ఉద్యోగాలు చేసేందుకు ఎంపిక చేసుకున్నారు. 311 మంది హాజరైన ఈ జాబ్‌మేళాలో 144 మంది తమ సత్తాచాటి కొలువులు సంపాదించగా మరో 48 మంది రెండోదశ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. మదర్ అండ్ ఫాదర్ హోమ్ నర్సింగ్ సర్వీసెస్‌కు 52 మంది, పేటీఎం సంస్థకు 26 మంది, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌కు 20 మంది, అపోలో ఫార్మసీకి 12 మంది, డైకిన్, మోహన్ స్పింటాక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 10 మంది చొప్పున ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు అన్ని వసతులతో పాటు రూ.10వేల నుంచి రూ.16 వేల వరకు వేతనాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. ఏజెన్సీలో జాబ్‌మేళాను నిర్వహించి తమకు ఉద్యోగాలు లభించేలా చర్యలు చేపట్టడం పట్ల నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి అవకాశం



జాబ్‌మేళాకు పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన పెద్ద కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించడం హర్షణీయం. దీని ద్వారా నా లాంటి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. నిరుద్యోగులకు జాబ్‌మేళాలు ఓ వరం వంటివి. కొండరెడ్డి యువకుడినైన నాకు విజయవాడలోని నవత ట్రాన్స్‌పోర్టులో ఉద్యోగం లభించడం సంతోషంగా ఉంది.

– కదల ప్రవీణ్‌ప్రకాష్‌రెడ్డి, జీడిగుప్ప, వీఆర్‌పురం మండలం

ఆనందంగా ఉంది



మారుమూల గ్రామంలో ఉంటున్న నాకు ప్రభుత్వం చొరవతో ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది. నర్సింగ్ కోర్సు చేసిన నాకు విశాఖపట్నంలోని మదర్ అండ్ ఫాదర్ హోం నర్సింగ్ సర్వీసెస్ సంస్థలో ఉద్యోగం లభించింది. నా కుటుంబానికి ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ ఉద్యోగం ఎంతగానో దోహదపడుతుంది.

– జాటోతు పావని, బూరుగువాయి, ఎటపాక మండలం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ప్రభుత్వం గ్రామాల్లో జాబ్‌మేళా నిర్వహించి, నా లాంటి ఎంతో మందికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించడం హర్షణీయం. చింతూరులో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా ఉద్యోగం పొందాను. ఈ ఉద్యోగం నా కుటుంబ పోషణకు ఎంతగానో దోహదపడుతుంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– జాటోతు కరుణ, ఎటపాక మండలం

జాబ్‌మేళాతో ఎంతో ఉపయోగం



మారుమూల గ్రామాల్లో ఉండే మా లాంటి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న జాబ్‌మేళాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. జాబ్‌మేళా విషయం తెలిసి దరఖాస్తు చేసుకున్న నాకు ఉద్యోగం లభించింది. గ్రామీణ యువతకు జాబ్‌మేళాలు వరం వంటివి.

– పైదా సాంబయ్య, అయ్యవారిగూడెం, కూనవరం మండలం



ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జరిగిన ముగింపు వేడుకల్లో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

విక్రాంత్.. విక్రమాదిత్య శాఖ

- ఈ మూడు భారత దేశ అద్భుతాలే..
- వివిధ దేశాల ప్రతినిధులు ప్రశంసలు
- ఘనంగా మిలాన్–2024 ముగింపు వేడుకలు
- విక్రాంత్ యుద్ధ విమాన వాహక నౌకపై వీడ్కోల సమావేశం



సీ ఫేజ్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం : భారత నౌకాదళానికి యుద్ధ విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఎంత విలువైనవో.. తూర్పు తీరానికి విశాఖపట్నం నగరం అంతే విలువైందని.. విశాఖ వేదికగా.. ఈ నెల 19 నుంచి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సహకారంతో భారత నౌకాదళం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్–2024 వేడుకలు మంగళవారం ముగిశాయి. 51 దేశాలు పాల్గొనగా.. మిలాన్ చరిత్రలో ఇదే అతి పెద్దదిగా రికార్డు నెలకొల్పింది. సీ ఫేజ్ విన్యాసాలు చివరి రోజున.. విశాఖ సముద్ర జలాల్లో ఒళ్లు గగుర్పొడిచేలా యుద్ధ విన్యాసాలు నిర్వహించారు. భారత్‌కు చెందిన యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, యుద్ధ నౌకలు సహా 35 యూనిట్స్ ఈ విన్యాసాల్లో పాల్గొనగా.. వివిధ దేశాలకు చెందిన 13 యుద్ధ నౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్ కూడా భాగస్వామ్యమయ్యాయి. భారత నౌకాదళానికి చెందిన ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ షిప్స్ ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. షిప్‌ని ఆక్రమించుకున్న సముద్రపు దొంగల బారి నుంచి ఎలా రక్షించాలనే అంశాలపై జరిగిన విన్యాసాలు హైలెట్‌గా నిలిచాయి. సముద్ర ఉపరితలంలో మిస్సైల్స్, గన్ ఫైరింగ్‌లు, యాంటీ–ఎయిర్ షూట్‌లు, ఇండియన్ నేవీ సబ్‌మెరైన్‌లతో యాంటీ–సబ్‌మెరైన్ వార్‌ఫేర్ విన్యాసాలు, ఫైటర్‌లకు వ్యతిరేకంగా వాయు రక్షణ దళాల విన్యాసాలు, ప్రయాణించే షిప్‌పై హెలికాప్టర్‌ల ల్యాండింగ్ తదితర కార్యకలాపాలతో పాటు ఇండియన్ నేవీ ట్యాంకర్ల నుంచి ఇంధనం నింపడం వంటి సీమాన్‌షిప్ విన్యాసాలు జరిగాయి. మిలాన్ ముగింపు వేడుకల్ని ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌పై నిర్వహించారు. వివిధ దేశాల కమాండింగ్ అధికారులు తుది సమావేశంలో పాల్గొన్నారు. విశాఖ నగరం అద్భుతంగా ఆతిథ్యమిచ్చిందని పలు దేశాల ప్రతినిధులు కొనియాడారని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

బోడి దొరను పరామర్శించిన పీవో అభిషేక్



బోడి దొర యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో అభిషేక్

మహారాణిపేట : కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గాం గంటం దొర మనవడు బోడి దొరను పరామర్శించి, ఆయనకు అందుతున్న వైద్య సేవల గురించి అల్లూరి సీతారామారాజు జిల్లా ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వైద్యులను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. రక్తం తక్కువగా ఉండటం వల్ల రెండవ సారి రక్తం ఎక్కించామని, నాలుగైదు రోజుల్లో కోలుకునే అవకాశం ఉందని వైద్యుడు డాక్టర్ సంపత్ తెలిపారు. కోలుకున్న తర్వాత వార్డులోకి మారుస్తామన్నారు. బోడి దొర స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకుడని ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు పీవో సూచించారు. గత శుక్రవారం జాతీయ అల్లూరి యువజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు సారథ్యంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రతినిధుల బృందం పాడేరు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీతను కలసి బోడి దొరకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై పాడేరు పీవో అభిషేక్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గాం గంటం దొర మనవడు బోడి దొరను పరామర్శించారు. సరైన సమయంలో స్పందించిన జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, శ్యామల వరలక్ష్మి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, చిట్టిబాబులను పీవో అభిషేక్ ప్రత్యేకంగా అభినందించారు. పీవో అభిషేక్ వెంట జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అనుబంధ సంస్థ విశాఖ జిల్లా అల్లూరి గంటం, మల్లుదొరల సేవా సంఘం అధ్యక్షుడు శివంగి నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు గుంటు చిట్టిబాబు, కంబాల శంకరరావు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు

10 కిలోలు స్వాధీనం



గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితులు

మోతుగూడెం: డొంకరాయి పోలీస్ స్టేషన్ చెక్ పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఓఎస్‌డీ కె.వి.మహేశ్వరరెడ్డి, చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్ర ఆదేశాల మేరకు మంగళవారం తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. డొంకరాయి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఘట్కేసరి, బోడుప్పల్‌కి చెందిన పర్నాటి రవి, మట్టాడి ప్రమోద్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినట్టు చెప్పారు. ఒడిశాలోని చిత్రకొండ ఏరియాలో 6 కిలోల గంజాయి కొనుగోలు చేసి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం వాహనాలు తనిఖీ కొనసాగిస్తుండగా మరో రెండు బైక్‌లపై విజయవాడ, గుంటూరు ఏరియాకు చెందిన మేకా అమర్ రెడ్డి, గరికిన లక్ష్మణ్, షేక్ మహబూబ్, ఒక మైనర్ బాలుడు గంజాయితో పట్టుబడినట్టు తెలిపారు. వీరి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. చింతూరు సీఐ గజేంద్ర కుమార్ రెండు కేసుల్లో ఐదుగురు నిందితులను రిమాండ్ కి తరలించి, మైనర్ బాలుడ్ని జువెనైల్ హోమ్ కి తరలించారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై అధిష్టింప జేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఆత్మ స్థైర్యంతో పరీక్షలు రాయాలి

డుంబ్రిగుడ(అరకులోయ టౌన్): విద్యార్థులు ఆత్మ స్థైర్యంతో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయాలని జిల్లా ఇంటర్మీడియెట్ పరీక్షల ప్రత్యేక అధికారి వినోద్‌బాబు అన్నారు. డుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానరమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సర్పంచ్ వెంకటరావు, ఎంపీటీసీ గీత, వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, కళాశాల వసతి గృహ అధికారి రవి పాల్గొన్నారు.

36 మందికి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

చింతూరు: స్థానికంగా మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 36మంది యువతీయువకులకు సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురికి వ్యాధి లక్షణాలున్నట్టు గుర్తించామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. వైద్యశిబిరాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో కావూరి చైతన్య మాట్లాడుతూ ఈ వ్యాధిపై యువతకు అవగాహన ఉండాలని, వ్యాధి లక్షణాలు కనబడితే సమీప ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటరు అవగాహన సదస్సు కూడా నిర్వహించి, కొత్తగా 50మందిని ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

యువతి కిడ్నాప్‌కు ఆటోడ్రైవర్ యత్నం

- ఆటో నుంచి దూకేసిన యువతి
- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- టూటౌన్ పోలీసుల అదుపులో డ్రైవర్



గాయాలతో యువతి

అల్లిపురం: ఓ యువతిని ఆటోడ్రైవర్ కిడ్నాప్‌కు యత్నించగా.. ఆమె భయపడి ఆటో నుంచి దూకేసింది. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నక్కవానిపాలెంలోని క్రాంతినగర్‌కు చెందిన కె.లహరి దొండపర్తి రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూంలో పనిచేస్తోంది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దొండపర్తిలోని షోరూంకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆటో దొండపర్తి వద్దకు చేరగా.. నిలుపదల చేయమని యువతి అడిగింది. అయితే డ్రైవర్ ఆటో ఆపకుండా రైల్వేస్టేషన్ వైపు వేగంగా వెళ్లడంతో యువతి కేకలు వేసింది. డీఆర్ఎం జంక్షన్ దాటి తర్వాత ఆటో నుంచి దూకేసింది. దీంతో ఆమెకు ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎంఎల్‌సీ కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్‌ను గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసు నిందితులకు ఏడాది జైలు

విశాఖ లీగల్: యజమాని ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగలించిన నేరానికి నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కేవీఎల్ హిమబిందు మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ దీక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. నిందితుడు వాసుపల్లి ఎల్లాజి కారు డ్రైవరు. యజమాని వాకాడ రాజశేఖర్ రెడ్డి ఎండాడ సమీపంలోని అపెక్స్ అపార్టుమెంట్లో ఉంటున్నారు. గత ఏడాది సంక్రాంతి సెలవులకు ఆయన తమ కుటుంబ సభ్యులతో రాజమహేంద్రవరం వెళ్లారు. ఆ సమయంలో ఇంటి తాళాలను కారు డ్రైవర్ ఎల్లాజికి ఇచ్చారు. పండగ తర్వాత రాజశేఖర్ రెడ్డి తన ఇంటికి వచ్చి, బీరువా తెరిచి చూడగా..బంగారు ఆభరణాలేవీ కనిపించలేదు. డ్రైవర్ ఎల్లాజీని అడగ్గా తనకు సంబంధం లేదని మాటదాటేశాడు. అనుమానం వచ్చిన రాజశేఖర్‌రెడ్డి ఆరిలోవ పోలీసులను సంప్రదించారు. నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ శివ దర్యాప్తు ప్రారంభించారు. ఎల్లాజీపై అనుమానం వచ్చి అతనిని అరెస్ట్ చేశారు. నగలు, ఇతర ఆభరణాలు తనకు పరిచయం ఉన్న మైలపల్లి నరసింహరాజు దగ్గర ఉంచినట్లు ఎల్లాజీ అంగీకరించాడు. పోలీసులు నరసింహరాజు కూడా అరెస్ట్ చేశారు. ఇరువురిపై సెక్షన్ 381,411 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో రెండో నిందితుడు నరసింహారాజు కూడా మూడు నెలలు జైలు, రూ.పది వేలు జరిమానా విధించారు.

ఘాట్ రోడ్డులో జీపు బోల్తా


ఇద్దరికి స్వల్ప గాయాలు



ననుబరి ఘాట్ వద్ద బోల్తా పడిన జీపు

పెదబయలు: మండలంలోని మారుమూల ఇంజరి పంచాయతీ ననుబరి ఘాట్ ఎక్కుతూ అదుపు తప్పి జీపు బోల్తా పడింది. ననుబరి గ్రామస్తులు అందించిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో జి.మాడుగుల మండలం నుర్మతి గ్రామానికి చెందిన జీపులో ఇంజరి పంచాయతీ దుద్దుపల్లి గ్రామంలో పెళ్లి సామగ్రి తీసుకొని వెళ్తుండగా ననుబరి ఘాట్‌రోడ్డు ఎక్కుతుండగా ఒక్కసారిగా బ్రేక్ ఫెయిల్ అయి అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. జీపులో డ్రైవర్‌తో నలుగురు ఉన్నారని అయితే డ్రైవర్ కిరణ్ చాకచక్యంగా వ్యవహరించడం వల్ల రోడ్డుపై బోల్తా పడిందని, లేకుంటే జీపు లోయలోకి వెళ్లి ఉండేదని ప్రాణనష్టం జరిగి ఉండేదని ననుబరి గ్రామస్తులు తెలిపారు. జీపులో ఉన్న దుద్దుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలైనట్టు తెలిపారు.

సారా బట్టీలపై దాడులు



రాయిపాడు గ్రామంలో సారా, పులుపు ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు



మారేడుబాకలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

డుంబ్రిగుడ(అరకులోయ టౌన్): ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కాంద్రుం పంచాయతీ రాయిపాడు గ్రామ సమీపంలోని సారా బట్టీలపై డుంబ్రిగుడ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, ఒడిశా రాష్ట్రం పాడువా పోలీసులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 3200 లీటర్ల సారా, ఊటలను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సారా తయారు చేసినా, అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక పంచాయతీలోని శివారు అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీపై మంగళవారం జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు నేతృత్వంలో సిబ్బంది దాడి జరిపారు. ఈ దాడిలో 200 లీటర్ల బెల్లం ఊట (పులుపు) ధ్వంసం చేశామని, సారా తయారీ సామగ్రి ధ్వంసం చేసినట్టు చెప్పారు. దాడిలో పట్టుబడిన మారేడుబాక గ్రామానికి చెందిన బెన్నోజు లోవకుమార్ నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్ట్ చేశామన్నారు. నిందితుని అడ్డతీగల ఏఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా 15 రోజుల రిమాండ్ విధించినట్టు చెప్పారు.

అరకులోయ చేరుకున్న భువనేశ్వరి

సాక్షి, పాడేరు: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి మంగళవారం రాత్రి అరకులోయకు ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. బుధవారం ఉదయం అరకులోయ మండలం మాదెల పంచాయతీ ముసిరిగుడ, పాడేరు మండలం కిండంగి,జి.మాడుగుల మండల కేంద్రాల్లో పర్యటించి సభలు నిర్వహిస్తారు.